



ఇంటర్వ్యూ

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావొద్దు

- జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో డీఐఈవో రవికుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికావొద్దని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాయంత్రాంగం, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షల ఏర్పాట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో డీఐఈవో రవికుమార్ పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఇంటర్ పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి?

డీఐఈవో: ఈనెల 5వ తేదీ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షతో ప్రారంభం కానుండగా, 6వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 25వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నాయి.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు?

డీఐఈవో: జిల్లా వ్యాప్తంగా 36,222 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 15,053 మంది కాగా, ఒకేషనల్ విద్యార్థులు 2,736 మంది మొత్తం 17,789 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ రెగ్యులర్ 13,944 మంది, ప్రైవేటు (సప్లిమెంటరీ) 2,128 మంది, ఒకేషనల్ రెగ్యులర్ 2,042 మంది, ప్రైవేటు 319 మంది మొత్తం 18,433 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఆంధ్రజ్యోతి: జిల్లా వ్యాప్తంగా ఎన్ని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు?

డీఐఈవో: జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 16, ఎయిడెడ్ 2, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 2, మోడల్ జూనియర్ కళాశాలలు 7, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 2, బీసీ వెల్ఫేర్ కళాశాల 1, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 26, ప్రభుత్వ హైస్కూల్ 1 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.


ఆంధ్రజ్యోతి: మాస్ కాపీయింగ్ నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఐఈవో: మాస్ కాపీయింగ్ నిరోధానికి పరీక్షల నిర్వహణ కమిటీతో పాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, 8 సిట్టింగ్ స్క్వాడ్, ఒక హైపవర్ కమిటీని, జిల్లా పరీక్షల నిర్వాహన కమిటీని ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే పరీక్ష బెండళ్లను తెరవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌ల అనుమతి లేదు. సీఎస్‌డీవోలు సైతం సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లడానికి వీలులేదు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి?

డీఐఈవో: పరీక్షలు అనగానే విద్యార్థుల్లో సహజంగా ఒత్తిడి ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలకు హాజరుకావాలి. పరీక్ష 9గంటలకు ప్రారంభం కానుండగా విద్యార్థులు 8గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలి. ప్రైవేటు కళాశాలలు హాల్‌టికెట్లు ఇవ్వనట్లయితే ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షకు హాజరుకావచ్చు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం కానీ కళాశాల ముద్ర కానీ అవసరం లేదు. ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో పరీక్షకు హాజరుకావచ్చు. పరీక్షల విషయంలో బయట ఎలాంటి పుకార్లు వచ్చినా నమ్మవద్దు.

(ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ అర్బన్)



గణనీయంగా వరి సాగు

- జిల్లా వ్యాప్తంగా యాసంగిలో భారీగా పెరిగిన వరిసాగు విస్తీర్ణం
- ఈ సంవత్సరం భారీగా దిగుబడి వస్తుందని అంచనా
- బోధన్ డివిజన్‌లో ఈనెలాఖరులో కోతలు మొదలు పెట్టనున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా కొనుగోలుకు ముందస్తుగా సిద్ధమవుతున్న యంత్రాంగం

నిజామాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈ యాసంగిలో సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులు వానాకాలం లాగానే సాగు విస్తీర్ణం భారీగా పెంచారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో వరి సాగు చేశారు. దీంతో ధాన్యం దిగుబడి భారీగా రానుంది. సన్నరకాలకు బోనస్ ఆశతో ఎక్కువ మంది రైతులు వరి సాగు చేశారు. జిల్లాలో సుమారు 11లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రానుండటంతో అధికారులు కూడా వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెలాఖరులో బోధన్ డివిజన్ పరిధిలో వరి కోతలు మొదలు కానుండటంతో ముందస్తుగానే కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సాగు అయిన వరిసాగుపై నివేదికను పంపిన అధికారులు ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

5లక్షల 7వేల 362 ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో ఈ యాసంగిలో మొత్తం 5లక్షల 7వేల 362 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. దీనిలో 4లక్షల 19వేల 328 ఎకరాల్లో వరి మాత్రమే రైతులు వేశారు. ఈ యాసంగిలో సాగు అయిన మొత్తం వరి విస్తీర్ణంలో 70 శాతం వరకు సన్నరకాలనే రైతులు వేశారు. అధికారుల లెక్కల ప్రకారం సుమారు 3 లక్షల ఎకరాలకు పైగా సన్నాలను సాగు చేశారు. జిల్లాలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల నుంచి పంటలకు నీటిని విడుదల చేయడంతో సాగు బాగా పెరిగింది. నవంబర్ నుంచి జనవరి చివరి వరకు రైతులు వివిధ దశల్లో ఈ వరిసాగును చేపట్టారు. వారు జనవరి చివరి వారం వరకు రైతులు వరిసాగు చేశారు. అధికారులు తీసుకున్న డిజిటల్ సర్వే ప్రకారం ఈ విస్తీర్ణం భారీగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాలుకు రూ.500 వానాకాలంలో బోనస్ ఇవ్వడంతో యాసంగిలో కూడా వస్తుందని ఆశతో ఎక్కువ మంది రైతులు వేశారు. బోధన్ డివిజన్ పరిధిలోని వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, సాలూరా, ఎడపల్లి మండలాల పరిధిలో ముందస్తుగా రైతులు వరి నాట్లు వేశారు. అధికారుల లెక్కల ప్రకారం ఈనెలాఖరున ఈ డివిజన్ పరిధిలో వేసిన పంటలు కోతలకు రానున్నాయి. ఇవేకాకుండా ఇతర మండలాల పరిధిలో కూడా డిసెంబర్ నుంచి జనవరి వరకు సాగు చేశారు. ఈ వరి కూడా ఏప్రిల్ నెలలో చేతికి రానుంది.

పంటలపై అధికారుల దృష్టి

జిల్లాలో వరిసాగు గణనీయంగా పెరగడంతో అధికారులు ముందస్తుగా పంటలపై దృష్టిపెట్టారు. జిల్లాలో సాగైన వరి విస్తీర్ణం ఆధారంగా వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో వేసిన పంటల విస్తీర్ణం ప్రకారం యాసంగిలో సుమారు 11లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అంచనాకు వస్తున్నారు. వచ్చే దిగుబడి ప్రకారం సన్నరకాలు సుమారు 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వస్తుందని అంచనా వేశారు. వచ్చే యాసంగి దిగుబడికి అనుగుణంగా ముందస్తుగానే కొనుగోలు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు యాసంగి ధాన్యం కొనుగోలు పై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాకున్నా ముందస్తుగా మాత్రం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు ఎంత మొత్తం కేంద్రాలకు వస్తుందో అంచనాకు వస్తున్నారు. వానాకాలంలో రైతులు సన్నరకాలను ముందస్తుగానే వ్యాపారులకు అమ్మకాలు చేశారు. ఈ యాసంగిలో మాత్రం ఎక్కువ మంది రైతులు బోనస్ కోసం కొనుగోలు కేంద్రాలకే తీసుకువచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా సిద్ధం చేసుకుంటున్నారు. దిగుబడి, కొనుగోలు కేంద్రాల ఆధారంగా కావాల్సిన గన్నీ బ్యాగులు, వాహనాలు, ఇతర సామాగ్రిని ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. ప్రాజెక్టుల పరిధిలో విస్తీర్ణం పెరగడం వల్ల దిగుబడి కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ యేడాది వరిసాగు విర్తీర్ణం భారీగా పెరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. సాగు విస్తీర్ణం పెరగడం వల్ల పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



పసుపు బోర్డు కార్యదర్శిగా భవానిశ్రీ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా నియామకమైన ఐఏఎస్ అధికారి భవానిశ్రీ సోమవారం జిల్లా కేంద్రంలోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే జిల్లాలో పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోగా.. జిల్లాకు చెందిన పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. అలాగే గత నెల 28వ తేదీన 2017వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి భవానిశ్రీని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పసుపు వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం..

జక్రాన్‌పల్లి: దేశంలో పసుపు వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా మని జాతీయ పసుపుబోర్డు కార్యదర్శి భవానిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్ర మను జాతీయ పసుపుబోర్డు కార్యదర్శి భవానిశ్రీ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాను జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా మనోహరాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను సందర్శించడం ఆనందం ఉందని కార్యదర్శి భవానిశ్రీ అన్నారు. ఈ పరిశ్రమలో పసుపు ఉత్పత్తులు ఎలా తయారు చేస్తున్నారన్న దానిపై ఆమె యంత్రాలను పరిశీలించారు. గత పదేళ్ల క్రితం యోగాపై ప్రజల్లో అవగాహన లేకుండేదని, ప్రధాని నరేంద్ర మోదీ వచ్చక యోగాను ప్రజల్లోకి తీసుకు వచ్చి యోగాపై అవగాహన సదస్సు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. అదే తరహాలో దేశంలోనే ప్రజలు పసుపును తక్కువగా వాడుతు న్నారని, కేవలం పసుపును వంటకాల్లో కాకుండా అన్ని రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. పసుపు వాడకం వల్ల అన్ని విధాలుగా ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. పసుపు వాడకంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అన్ని విధాలుగా ఆరోగ్యానికి పసుపు అవసరంగా పని చేస్తుందని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఎంకెపీఎం ఎస్‌పీవో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.




పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను పరిశీలిస్తున్న జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ, పసుపుబోర్డు చైర్మన్, రైతులు

ఏసీబీకి చిక్కిన నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్

- రూ.10వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత
- సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ రాజుతో పాటు సహాయకుడూ అరెస్టు

ఖిల్లా, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న చెన్నమాధవాని శ్రీరామరాజు సోమవారం రూ.10వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మల్టీజోన్ బదిలీల్లో భాగంగా శ్రీరామరాజు గతేడాది ఆగస్టులో ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చాడు. అయితే నగరానికి చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసిన స్థలాన్ని తన పేరిట మార్చే విషయమై ఇటీవల సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ రాజును కలిశాడు. ఇందుకు గాను తనకు రూ.10వేలు ఇవ్వాలని శ్రీరామ రాజు డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు వ్యక్తి తనకు న్యాయం చేయాలంటూ రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ముందస్తు పథకం ప్రకారం.. సోమవారం బాధిత వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ శ్రీరామరాజుకు రూ.10వేల లంచం ఇస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీరామరాజుతో పాటు అతని వద్ద సహాయకుడిగా పని చేస్తున్న రంగ్‌సింగ్ వెంకటరావ్‌ను కూడా అధికారులు అరెస్టు చేశారు. వీరిని హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు.


ఏసీబీకి పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ రాజు

చివరి ఆయకట్టు వరకూ నీరందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నిజామాబాద్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పంటలకు చివరి ఆయకట్టు వరకూ సాగు నీరందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె యాసంగి పంటలకు సాగునీటి సరఫరా, నీటి పారుదల శాఖ పనితీరుపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. యాసంగి పంటలకు రాబోయే పది రోజులు చాలా కీలకమన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ పంటలకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందని.. పంటలకు సమృద్ధిగా నీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎస్సారెస్పీ, ఎస్సారెస్పీ స్టేజ్ 2, ఇతర ప్రాజెక్టుల కింద నిర్దేశిత ఆయకట్టుకు సాగు నీరందించేలా చూడాలని అధికారులను శాంతికుమారి ఆదేశించారు. అలాగే సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి.. ప్రజలకు భాగస్వామ్యం చేస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

టీచర్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు

- జిల్లాలో బీజేపీ నేతల సంబురాలు

ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందారు. సోమవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఆయన విజయం సాధించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచారు.


ఎమ్మెల్సీగా కొమురయ్య గెలుపొందడంతో నగరంలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ శ్రేణులు



కరీంనగర్‌లో విజయ కేతనం చూపుతున్న కొమురయ్య

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్ సిద్దులగుట్టపై పూజలు చేస్తున్న సునీల్‌కుమార్

పెర్కిట్, మార్చి3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతలతో, బిల్వపత్రాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప ఎల్లమ్మతల్లి, హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేసి శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ కమిటీ వారు పూర్ణకుంభంతో సునీల్‌కుమార్‌ను ఘనంగా స్వాగతం పలికారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేశారు. ఆలయ కమిటీ వారు ప్రతీసోమవారం అందించే సిద్దులగుట్టపై అన్నప్రసాదానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, బట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, చెందెవి శ్రీనివాస్, కొంతం మురళీ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో నల్ల పోచమ్మ విగ్రహం ఊరేగింపు



మంగళ హారతులతో విగ్రహానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

కోటగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో సోమవారం నల్లపోచమ్మ విగ్రహం ఊరేగింపు కార్యక్రమం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో కొత్తగా నల్ల పోచమ్మ దేవాలయం నిర్మించగా మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నల్ల పోచమ్మ దేవి విగ్రహాన్ని గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి భజాభజం త్రీలతో మంగళ హారతుల మధ్య ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగాధర్ దేశాయ్, గజేందర్, భీమా సాయిరెడ్డి, రవి,సాయిలు,వీరేశం, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్ బస్టాండ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ

బోధన్ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ సూచించారు. బోధన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం సీపీ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో వాహన దారులకు, ప్రజలకు పలు అంశాలపై నాటిక, పాటలతో అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడ్డ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేస్తామన్నారు. మూఢ నమ్మకాలు విశ్వసించవద్దని, ఇళ్ళు, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నకిలీ ఏజెంట్లునిరుద్యోగులకు మాయమాటలు, లేనిపోని ఆశ్యాలు కల్పించి మోసం చేస్తున్నారని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

కోటగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):కోటగిరి మండల ఎమ్మార్పీ ఎస్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజ కవర్గ నాయకులు పోచిరామ్ తెలిపారు. అధ్యక్షులుగా శ్రీకాంత్, ఉపా ధ్యక్షుడిగా శ్రీనివాస్, జలయ్య, ప్రధాన కార్యదర్శిగా రేణి సాయిలు, కోశాధికారి సాయిబాబు, సహాయ కార్యదర్శిగా నితిన్, ప్రచార కార్య దర్శిగా విజయ్, రవీందర్, సలహాదారులుగా సాయిలు, కృష్ణ, మా రుతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వినోద్, సాయిలు, దినేష్ తదితులు పాల్గొన్నారు.

యాద్గార్‌పూర్‌లో బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కోటగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం యాద్గార్ పూర్ గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్‌లు, డైరీలను మాజీ ఎంపీటీసీ సయ్యద్ ఫారూఖ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సమీర్, సయ్యద్, అంజనేయులు, కిష్టయ్య, అశోక్, సాయినాథ్, అనిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్,మార్చి 3(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలో విద్యుత్ సరఫరాలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ వన్-1 ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. పట్టణంలో విద్యుత్ అంత రాయం కలుగకుండా ఉండేందుకు అభివృద్ధి పనుల్లో భాగంగా సరస్వతినగర్, శర్భతికెనాల్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, శివాలయం టెంపుల్, ఓల్డ్ బస్టాండ్, మార్కెట్ రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, కోర్టు ఏరియా, లింగమయ్య పార్కు తదితర కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధిహామీలో కూలీలకు పనులు కల్పించకపోతే చర్యలు తప్పవు

● కోటగిరిలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికలో డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్



కోటగిరి సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

కోటగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని, లేనిపక్షంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లపై తగిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ హెచ్చరించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఏప్రిల్- 1, 2023 నుంచి2024 మార్చి 31 వరకు కోటగిరి ఉమ్మడి మండలంలో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో రూ.రెండు కోట్ల 39 లక్షల 63 వేల 280 ఖర్చు చేయగా కూలీలకు రూ.రెండు కోట్ల 29 లక్షల పది వేల 259ల,సామగ్రి కింద రూ.పది లక్షల 53,210 చెల్లింపులు అధికారులు తెలిపారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం వివరాలు సేకరించింది. ఉపాధిహామీ సిబ్బంది కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్ కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడా, మస్టర్లలో కూలీల సంతకాలు హాజరు లేకుండా వేతనాలు చెల్లింపులు తదితర తప్పిదాలపై 22 వేల జరిమానా విధించడంతో పాటు రూ.5,500 రికవరీకి ఆదేశించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు ఉపాధిహామీ పథకం కింద ఖర్చు చేస్తున్నామన్నారు. కూలీల సంఖ్యను పెంచడం ద్వారా మెటిరియల్ కాంపోనెంట్ పెరుగుతుందన్నారు. పని ప్రదేశంలో నేమ్ బోర్డులను ఏర్పాటు చేసి కూలీలను పనులకు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెలాఖరు చిన్న గ్రామాల్లో 20 నుంచి 50 మంది, పెద్ద గ్రామాల్లో వంద మందికిపైగా కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, చందర్, ఏపీవోలు గంగారాం, రమణ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట సాగులో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన

జక్రాన్‌పల్లి, మార్చి3(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు, పంట సాగులో శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు, సూచనలు, మేళకువలు పాటిస్తే పంట దిగుబడి వస్తుందని ఐటీఎం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కలిగోట్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, సేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతు క్షేత్రాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు. అనంతరం ప్లాంట్-2 ప్రొడక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత వారు వారాల నుంచి క్షేత్రస్థాయిలో వరి పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు పాటించాల్సిన అన్ని సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఓనప్పగౌడ మాట్లాడుతూ వరి పంటలకు పురుగులు మందులు వాడేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి, ఐపీఎం కిట్ ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. పురుగు గుడ్లపై వేప నూనె పిచికారి చేయాలని, రెక్కల పురుగుపై నిఘా పెట్టడానికి లింగకర్షక బుట్టలను రైతులకు అందజేస్తా మన్నారు.



రైతులకు లింగాకర్షక బుట్టను పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి దేవిక, ఏఈవో శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'తప్పుడు నివేదిక ఇచ్చిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆర్మూర్‌టౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి): సీఎంవో కార్యాలయానికి తప్పుడు నివేదికను అందజేసిన మున్సిపల్ కమిషనర్ రాజుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌కు వినతిపత్రాన్ని అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అక్రమాలపై గతంలో సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయగా అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు విచారణ చేయాలని ఆదేశాలు వచ్చాయని అన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రాజు విచారణ చేపట్టి నివేదికలో 144అక్రమ ఇంటి నెంబర్‌లు రద్దు చేశామని పొందుపర్చారని, ఆ ఇంటి నిర్మాణాలు, వ్యాపార సముదాయాలపై ఏలాంటి చర్యలు చేపట్టలేదని, కాలం చెల్లిన ఆటో ట్రాలీలను రిజిస్ట్రేషన్ ఇన్సూరెన్స్ లేకుండా వినియోగిస్తున్నారని, పెర్కిట్, కొటార్మూర ప్రాంతంలో ఇరిగేషన్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, షాపింగ్ కాంప్లెక్స్‌ను సీజ్ చేశామని తప్పుడు నివేదిక పంపించారని, పెర్కిట్‌లోని శివాలయం వెనుకల 36ఎకరాల అక్రమ వెంచర్‌లో మాటుకాలువను కబ్జా చేశారని ఫిర్యాదు చేస్తే ఏలాంటి విచారణ చేపట్టకుండా సీఎంవో కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించారని తెలిపారు. తప్పుడు నివేదిక అందజేసి కమిషనర్ రాజుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



కమిషనర్ చాంబర్‌కు వినతిపత్రాన్ని అతికించిన బీజేపీ నాయకులు

మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా చార్జీ తీసుకున్న కమిషనర్ కలెక్టర్ అంకిత్ మున్సిపాలిటీకి రాకపోవడం విడ్డరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, కిసాన్‌మోర్చ నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, ఆకుల రాజు, పాన్‌శీను, ఆరే.రాజేశ్వర్, గుగులోత్ తిరుపతినాయక్, ఖాందేశ్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన

ముప్కాల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద బాల్కొండ ఉన్నత పాఠశాలకు 25 ట్యాబ్‌లు మంజూరయ్యాయి. కాలానికి అనుగుణంగా సాంకేతిక రంగాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. ఇప్పటికే బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దృశ్య బోధన అమలవుతుంది. మనఊరు-మనబడి కింద రెండేళ్ల క్రితం ఎంపికైన బాల్కొండ ఉన్నత పాఠశాలకు ఇంటరాక్టివ్ స్లాట్ ప్యానల్‌ను ప్రభుత్వం సమకూర్చిందని, ఆధునిక సాంకేతికను ప్రయోగించి తెరపైవిద్యార్థులకు కళ్లకు కట్టినట్లు పాఠాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసిన ఎంఈవో రాజేశ్వర్

ప్రతిభావంతులకు సన్మానం

భీమ్‌గల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్య శిబిరంలో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచిన ప్రతిభవంతులకు సోమవారం భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ నర్సాపురం జిల్లాలోని కళాశాలలో పది రోజుల పాటు జాతీయ సమైక్య శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న తెలంగాణ స్టేట్ కాంటిజెంట్ లీడర్ పడిగెల సుదర్శన్, ఉత్తమ వలంటీర్ చింత గంగాప్రసాద్‌లు చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సుమలత, కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, లెక్చరర్‌లు లావణ్య, శంకర్, భూమన్న, గంగాధర్, రాజు, క్రాంతికుమార్, మోహినుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించాలి



ముగ్గులు పోసి మార్క్‌ఔట్ ఇచ్చి పనులను ప్రారంభించిన ఎంపీడీవో

భీమ్‌గల్‌రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని బెస్మెంట్ పూర్తి కాగానే రూ.లక్ష ప్రభుత్వం మంజూరు చేస్తుందని, అలాగే స్టేజిని బట్టి డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఐదుగురిని ఇందిరమ్మ ఇళ్లకు, ముగ్గులు పోసి మార్క్‌ఔట్ ఇచ్చి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోహౌసింగ్, డీఈ ప్రభు, ఏఈ సత్యనారాయణ, పంచాయతీకార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల ద్వారా ఇసుకకు అనుమతులు ఇవ్వండి



సర్వసమాజ్ సభ్యులను ఆశ్రయించిన దృశ్యం

భీమ్‌గల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధికి అవకాశంలేదని ప్రత్యామ్నాయంగా ఇసుకను ఎడ్లబండ్ల ద్వారా తీసుకుని ఉపాధి పొందెందుకు అవకాశం కల్పించాలని ఎడ్లబండ్ల నిర్వాహకులు కోరారు. సోమవారం సర్వసమాజ్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా సర్వసమాజ్ ద్వారా అధికారులతో మాట్లడి ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పని లేక పోవడంతోనే తాము పొట్టకూటి కోసం ఎడబండ్ల ద్వారా ఇసుక తెచ్చి స్థానికులకు విక్రయించడం జరుగుతుందని, ఎడ్లబండ్ల ద్వారా తెస్తున్న ఇసుకతో తాము ఇసుక అక్రమ రవాణాకు పాల్పడడంలేదన్నారు. సర్వసమాజ్ ద్వారా అధికారులతో చర్చిస్తామని కమిటీ అధ్యక్షుడు నీలం రవి హామీ ఇచ్చారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన ఏర్గట్ల విద్యార్థులు



కరాటేలో రాణించిన విద్యార్థులు

ఏర్గట్ల,మార్చి3(ఆంధ్రజ్యో తి): మూడవ జాతీయ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్స్ 2025 పోటీల్లో భాగంగా మంచిర్యాలలో జరిగిన పోటీల్లో సోమవారం మండల కేంద్రంలోని హయగ్రీవ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొన్ని అ ద్భుతమైన ప్రతిభచూపారు. వెంకటేష్ అనే విద్యార్థి బంగారు పతకం సాధించగా, ఇద్దరు విద్యార్థులు వెండి పతకాలు, మరో ఇద్దరికి రజిత పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అలివేణి, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది

● ఇచ్చిన హామీలను అమలుపరచడమే ధ్యేయం: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రైవేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు

బోధన్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, ఇచ్చిన హామీలను అమలపరచడమే పార్టీ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గత కొన్ని రోజుల క్రితం ప్రైవేట్ పాఠశాల, కళాశాల యాజమాన్యాలు పెండింగ్‌లో ఉపకార వేతనాలు ఇప్పించాలని, బోధన రుసుములు విడుదల చేయించాలని కోరారు. వెంటనే ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే ముఖ్యమంత్రి ఎమ్మెల్యే సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధన రుసుములను విడుదల చేశారు. సోమవారం బోధన్ ప్రైవేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు ఉపకార వేతనాలు ఇచ్చినందుకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి చేస్తున్నారని ఈసం దర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్, ఉషోదయ కరస్పాండెంట్ దుశ్యంత్‌లతో బోధన్ అధ్యక్షుడు హరి కృష్ణ, వివిధ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

మరమ్మతు పనులను పరిశీలించిన కమిషనర్



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ మహాలక్ష్మీ అపార్ట్‌మెంట్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మిషన్ భగీరథ వాటర్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులను చేపట్టాల్సిందిగా అధికారులకు సూచించారు. ఆయన వెంట వాటర్ సప్లయ్ ఇన్‌చార్జీ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దు



తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్‌టౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని ప్రతీఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 26వార్డులో తడిపొడి చెత్త, హానీకరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేసి కాలనీని శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నితిన్, మెప్మాఆర్పీ సమత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

31వరకు ఎల్ఆర్ఎస్‌ను క్రమబద్ధీకరించుకోవాలి

ఆర్మూర్‌టౌన్,మార్చి3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో 2020 సంవత్సరంలో రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యాజమానులు ఈనెల 31వరకు ఎల్ఆర్ఎస్‌ను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రుసుంలో 25శాతం తగ్గింపు రాయితీ ఇచ్చిందని ప్లాట్ యాజమానులు వినియోగించుకోవాలని అన్నారు.భవిష్యత్‌లో గృహనిర్మాణం చేసుకోవడానికి అధికరుసుము చెల్లించి అవకాశం ఉండదని తెలిపారు. అలాగే కొత్తగా ఇచ్చిన సూచనల ప్రకారం నిషేధిత భూములు కానివి వాటర్ బాడీస్‌కి 200 మీటర్ల వెలుపల గల సుమారు 2200ప్లాట్లకు దరఖాస్తుల కొరకై ఫీజు ఇంటీమెషన్‌లెటర్‌లు ఇచ్చామని,వారికి 25శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

కమ్మర్‌పల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత ఆరుసంవత్సరాల క్రితం కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇదే గ్రా మానికి చెందిన తుదిగేన దేవేందర్ అలియాస్ జానీ అనే వ్యక్తికి ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయాధికారి నెల్లి సరళ రాణి ఏడాది జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పువెలువరించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. 2019లో ఈఘనట జరుగగా బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎండి ఆసిఫ్ కేసునమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేశారని కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయాధికారి నిందితుడు దేవేందర్‌కు ఏడాది శిక్ష పడేవిధంగా తీర్పుచెప్పినట్లు తెలిపారు.నిందితుడికి శిక్ష పడేవిధంగా కోర్టులో కేసు ను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ వాదించినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి కోర్టులో సాక్షాలను ప్రవేశ పెట్టడంలో కీలకపాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ రాజును కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి అభినందించారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య


రెంజల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన జంగం నవీన్ (36) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది మృతి చెందాడని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాడ్ బిలోలి గ్రామానికి చెందిన జంగం నవీన్ నాలుగు సంవత్సరాల క్రితం భార్యను వదిలిపెట్టి ఒంటరిగా జీవిస్తుండేవాడని, మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించి మతి స్థిమితం కోల్పోవడంతో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామానికి చెందిన పెంట గంగాధర్ వ్యక్తి పొలం గట్టులో గల జామ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడని, అటువైపుగా వెళ్లిన గ్రామస్థులు లింగాల అబ్బయ్య తన పొలం వద్దకు వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న నవీన్ మృతదేహాన్ని చూసి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి జంగం శోభా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

కమ్మర్‌పల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన జల్లేండ్ల మల్లు (64) అనే మహిళ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లు మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి తన ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగు ఆమెను చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు చికిత్సపొందుతూ ఆమె మరణించింది. కొడుకు అనిల్ ఫిర్యాదు మేరకు శవపంచినామా జరిపించి శవాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త సాయన్న గతంలోనే మరణించగా కొడుకు అనిల్ ఉన్నారు.

రైతుకు సాగునీటి గండం

- జుక్కల్ నియోజకవర్గంలో తగ్గిన భూగర్భ జలాలు.. ఆందోళనలో రైతులు
- అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతన్నలు
- ఎండలకు కళ్లముందే ఎండిపోతున్న పంటలు
- కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం



● నీరు లేక ఎండిపోయిన వరి పంట

పెద్దకొడప్‌గల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైతుకు సాగునీటి గండం వెంటాడుతోంది. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో వ్యవసాయ భూములకు నీరు అందడం లేదు. నీరు అందక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ కమాండ్ ఏరియాలో ఉండగా, ఈ మండలాల్లో రైతులు సాగుచేసిన పంటలకు నిజాంసాగర్ సాగు నీరు అందుతోంది. దీంతో ఈ మండలాల్లోని పంటలు నేడు కళకళలాడుతున్నాయి. ఇక పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి మండలాలు నాన్ కమాండ్ ఏరియాలో ఉండగా ఈ మండలాల్లోని రైతన్నలు పంటలు సాగుచేసేందుకు చెరువులు, వాగుల నీటిని వినియోగించుకుంటారు. అయితే ఈ సంవత్సరం ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజక వర్గాలలో భారీవర్షాలు కురిసి ఆ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నిండిపోయాయి. ఇక జుక్కల్ నియోజక వర్గంలోని బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్, పిట్లం మండలాలలో మెజారిటీ రైతన్నలు వ్యవసాయ బోర్లపైననే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరుబావుల వద్ద పంటలను వేయడంతో ఆ పంటలు బాగా పండాయి. దీంతో ఆశజీవియైన రైతన్నలు రబీ సీజన్‌లో కూడా ఎలాగు పంటలు పండుతాయని వ్యవసాయ బోరుబావుల వద్ద వరి, జొన్న, మొక్క జొన్న, వేరుశనగ, నల్లకుసుమలు, శనగ పంటలను సాగు చేశారు.

తగ్గుతున్న భూగర్భ జలాలు

పంట సాగు చేసే ప్రారంభంలో వ్యవసాయ బోర్లలో నీరు అధికంగా ఉండటంతో ఎలాగూ పంటసాగు గట్టెక్కుతుందని భావించామని ప్రస్తుతం వ్యవసాయ బోరుబావులలో నీరు తగ్గిపోతుండటంతో ఏం చేయాలో తెలి యని పరిస్థితి నెలకొందని రైతన్నలు ఆందోళన చెందతున్నారు. మెజారి టీగా జొన్న పంటను సాగు చేసిన రైత న్నలు ఆ పంట ప్రస్తుతం కంకికి జొన్నలు పట్టే స్టేజిలో ఉందని మరో నెల రోజుల పాటు నీరు సరిపోతే పం ట చేతికి వస్తుందని పేర్కొంటున్నారు. అయితే రోజు రోజుకు భూగర్భ జలాలు తగ్గడంతో కండ్ల ముందు పంట ఎండిపోవడంతో తమ గుండెల్లో గాయం అవుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్స రం మార్చి చివరి వరకు వ్యవసాయ బోర్లలో నీరు తగ్గలేదని, ఈ సంవత్స రం మాత్రం ఫిబ్రవరి నెల నుండే నీరు తగ్గడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి దాపురించిందని క్షోభపడుతున్నారు. కనీసం పంటను రక్షించుకునేందుకు కొత్తగా బోరుబావిని తవ్విద్దామనుకున్న నీరు పండుతుందో లేదో తెలియడం లేదని పేర్కొంటున్నారు. కొంతమంది రైతులు పంటను రక్షించుకో వాలని ఆశతో వేలాది రూపాయలు అప్పు చేసి కొత్తగా బోరుబావులను తవ్విస్తున్నారు. అయిన నీరు పడకపోవడంతో బిక్కమొఖం వేస్తున్నారు.

పంటను రక్షించుకునేందుకు శత ప్రయత్నాలు

రైతన్నలు తాము సాగు చేసిన పంటలు నీరు సరిపోక ఎండిపోతుంటే ఆ పంటను రక్షించుకునేందుకు శత విధాలుగా ప్రయత్నం చేస్తున్నారు. తమ వ్యవసాయ బోర్లలో నీరు సరిపడనంత లేకపోవడంతో పక్కనే ఉన్న రైతులకు సరిపోయేంత నీరు ఉంటే వారికి డబ్బులు ఇస్తున్నారు. ఇంక కొంతమందైతే దూర ప్రాంతంలో ఏరు లేదా వాగు ఏదైనా ఉంటే అక్కడి నుంచి పైపులైన్ వేసుకుని నీరు తీసుకవచ్చి పంటలను రక్షించుకుంటున్నారు. ఇంక కొంతమంది తమ దగ్గర డబ్బులు లేకున్న అప్పు తీసుకవచ్చి కొత్తగా బోర్లను తవ్విస్తున్నారు.



● భూగర్భ జలాలు తగ్గడంతో తక్కువగా నీరు పోస్తున్న బోరుబావి

కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం

తగ్గిన భూగర్భజలాలతో కౌలు రైతులు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. తమకు భూములు లేకపోవడంతో ఇతరులు నుండి వేలాది రూపాయలు కౌలు చెల్లించి పంటలను సాగు చేస్తున్నారు. కౌలుతో పాటు పంట సాగుకు వేల రూపాయలు ఖర్చుచేశామని ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గడంతో పంటచేతికి రాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కౌలుతోపాటు పంట సాగు ఖర్చు తడిసిమోపెడయ్యిందని ఇది ఎలా తీరుతుందోనని రంది చెందుతున్నారు. ఎకరాకు రెండు పంటలకు కలిపి ఒక్కో ప్రాంతంలో 30వేల రూపాయల నుంచి రూ. 40వేల వరకు కౌలు ఇచ్చామని ఇప్పుడు పంట పండక అప్పుల పాలవుతున్నామని తెలిపారు.

బోరు నీరు పోయడం లేదు..



● తుకరాం జగదాంబ, తండా పిట్లం మండలం

రెండున్నర ఎకరాల్లో రెండు బోర్ల ద్వారా పంటలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్‌లో రెండు బోరుబావులలో నీరు పుష్కలంగా ఉంది. రబీలో బోరుబావులు బాగా నీరు పోస్తాయనే నమ్మకంతో వరి, జొన్న, టమాట, బెండ లాంటి పంటలు సాగుచేస్తున్నా. ఫిబ్రవరి నెలలోనే భూగర్భ జలాలు తగ్గిపోయాయి. ఒక బోరు ఎత్తిపోయింది. కొన్ని నీళ్లతోనే నీరు అందుతోంది. సరిపడా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.



బోరు బావి అడుగంటడంతో ఎండిపోతున్న జొన్నపంట



ఎండలకు నీరు అందక ఎండిపోతున్న టమాట పంట

పంట ఎండిపోతోంది..



● బర్దాల్ మోతీలాల్ కాటేపల్లి తండా

పెద్దకొడప్‌గల్ శివారులో భూములను కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నాం. 4 ఎకరాల భూమికి 1లక్ష 10వేల రూపాయల కౌలు చెల్లించా. ఖరీఫ్‌లో పంట బాగా పండగా.. ప్రస్తుతం ఉన్న బోరుబావులలో నీరు అడుగంటిపోయింది. దీంతో కళ్ల ముందే వరి పంట ఎండిపోతోంది. పక్కన ఉన్న వారిని నీరు అడుదామంటే వారిది ఇదే పరిస్థితి. ఇన్ని రోజులు కష్టపడి సాగు చేసిన పంట ఎండిపోతుంటే గుండె కలుక్కుమంటుంది. దీంతో కౌలు డబ్బులతో పాటు, పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడి మునిగిపోయే పరిస్థితి దాపురించింది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షలు

- కమ్మర్‌పల్లి జంబి హనుమాన్ ఆలయంలో తొలిరోజు యజ్ఞంలో పాల్గొన్నా అంజన్న భక్తులు
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తుల సౌకర్యార్థం

కమ్మర్‌పల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలో గ్రామగ్రామాన భక్తులు హనుమాన్ మండల దీక్షలను సోమవారం ప్రారంభించారు. హనుమాన్ దీక్షపరులతో అంజన్న ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. సోమవారం ఉదయం గోదారి పుణ్యస్నానాలు ఆచరించిన హనుమాన్ భక్తులు ఆయా ఆలయాలకు చేరుకోగా ఆయా గ్రామాల ఆలయ అర్చకులు హనుమాన్‌దీక్షలకు మాలధారణ చేశారు. అనంతరం నియమనిష్టలతో అంజన్న పూజలు, హారతి, యజ్ఞ కార్యక్రమాలతో దీక్షలు ప్రారంభించారు. ఆలయాల్లో జైశ్రీరాం, జైహనుమాన్ శరణుఘోష విన్పిస్తోంది. నిత్యం రెండు పూటల ప్రత్యేక పూజలు, కఠిన నియమాలతో దీక్షలు కొనసాగుతాయి. కమ్మర్‌పల్లి జంబిహనుమాన్ ఆలయంలో అర్చకులు కప్పగంటి రమేశ్చంద్ర శాస్త్రీ గ్రామానికి చెందిన సుమారు 70 నుంచి 80మంది అజన్నభక్తులకు మాలధారణ చేసి తొలిరోజు హారతి, యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన 40 మంది అంజన్న భక్తులు మండల దీక్షలు స్వీకరించారు. అన్ని గ్రామాలలోని అంజన్న ఆలయాల్లో హనుమాన్ దీక్షాపరుల సౌకర్యార్థం ఆలయ, గ్రామ అభివృద్ధి కమిటీల ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



జంబి హనుమాన్ ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్న అంజన్న మండల దీక్షాపరులు

స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వితరణ

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ధాత్రిక రాజ్‌కుమార్ తన సొంత ఖర్చులతో కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తుల సౌకర్యార్థం భిక్ష అల్పాహారం సమయంలో అంజన్న భక్తులకు సుమారు 80 నుంచి 90 మందికి స్టీల్ పల్లాలు, స్టీల్ గ్లాస్‌లు వితరణ చేశారు.

ఉద్యోగులతో వ్యక్తిగత పనులు!?

- దేవాదాయ శాఖ అధికారి ఇంట్లో పనులు చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులు
- నిజామాబాద్ నుంచి పిలిపించి చాకిరీ చేయించుకుంటున్న వైనం
- స్పందించని అధికారి!!

నసురుల్లాబాద్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఓ బాధ్యత గల ప్రభుత్వ ఉన్నతాధికారి తన ఇంటి నిర్మాణ పనులను తన కార్యాలయ కిందిస్థాయి ఉద్యోగులతో పనులు చేయించడం విస్మయానికి గురిచేస్తోంది. నిజామాబాద్ నుంచి వీరిని పిలిచి కూలీలుగా మార్చి వారితో చాకిరీ చేయించుకుంటున్న దేవాదాయశాఖ ఉన్నతాధికారి ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న దేవాదాయశాఖ ఉన్నత అధికారి ఇడుపులపాటి శ్రీనివాస్‌రావ్ తన ఇంటి నిర్మాణ పనులను నిజామాబాద్ ఎండోమెంట్ ప్రభుత్వఉద్యోగులతో చేయిస్తున్నారు. గత మూడు నెలలుగా వారిని కూలీలుగా మార్చి తన ఇంటి వద్ద పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం అయినా ఉద్యోగులకు సెలవు దినాన్ని కుటుంబ సభ్యులతో గడుపుకోవడానికి అవకాశం ఇవ్వకుండా చాకిరీ చేయించుకోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయమై కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత శాఖ ఉన్నతాధికారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాగా.. ఈ విషయంపై సంబంధిత జిల్లా అధికారిని వివరణ కోరడానికి 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. సదరు అధికారి స్పందించలేదు.



నసురుల్లాబాద్‌లోని దేవాదాయ శాఖ ఉన్నతాధికారి ఇంటి వద్ద పనులు చేస్తున్న సిబ్బంది

5న టీయూలో సైన్స్‌డే

డిచ్‌పల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 5న జాతీయ సైన్స్‌డే సందర్భంగా జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగాల ప్రదర్శన సదస్సు బ్రోచర్‌ను వైస్‌చాన్సిలర్ ఆచార్య టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, కన్వీనర్ డాక్టర్ ప్రసన్నశీల, కోకన్వీనర్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మహేందర్ ఐలేని లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీల మాట్లాడుతూ ఈ ప్రయోగాల ప్రదర్శన సదస్సుకు విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ ప్రదర్శనలో జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగ పద్దతులు ఉపయోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.



ప్రయోగ ప్రదర్శన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మార్కెట్‌కు పోటెత్తిన పసుపు

ఖిల్లా, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):మార్కెట్‌యార్డ్‌కు సోమవారం పసుపు పోటెత్తింది. మార్కెట్‌యార్డ్ ఆవరణలో ఎటు చూసినా పసుపు రాశులు కనిపించాయి. గత 4 రోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ఉండడంతో రైతులు సోమవారం మొత్తం 49వేల 541బస్తాల పసుపును అమ్మకానికి తెచ్చారు. ఈ సీజన్ ప్రారంభం నుంచి ఇంత మొత్తంలో పసుపు రాలేదు. సీజన్ ముగియడానికి వస్తున్నందున రైతులు బాగ ఉడుకబెట్టిన నాణ్యమైన పసుపును అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌కు ఎక్కువ పసుపు రావడంతో వ్యాపార లావదేవీలు రాత్రివరకు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది తెలిపారు.



మార్కెట్‌యార్డ్‌కు వచ్చిన పసుపు రాశులు

అడిషనల్ కంట్రోలర్‌గా డాక్టర్ సంపత్ నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న టి.సంపత్

డిచ్‌పల్లి,మార్చి3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో అడిషనల్ కంట్రోలర్‌గా డాక్టర్ టి.సంపత్‌ను నియమిస్తూ వైస్‌చాన్సిలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. సంపత్ దశాబ్దకాలంగా ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియామక ఉత్తర్వులు అందించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

- మహాలక్ష్మి ఆలయంతో పాటు పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా: రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, గొల్లకుర్మ సంఘ సభ్యులు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న బీరప్ప కళ్యాణ వేడుకలకు తనను ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో బీరప్ప కామరతి కళ్యాణ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పకుండా గ్రామంలో హనుమాన్ ఆలయంతోపాటు మహాలక్ష్మి ఆలయానికి ఎండోమెంట్ ద్వారా నిధులు మంజూరు చేసే విధంగా మంత్రి కొండా సురేఖను త్వరలోనే కలవడం జరుగుతుందని నిధుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తప్పక కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుండా మిట్టపల్లి గ్రామంలో రాజకీయ చైతన్యం ఎంతో ఉందని సిమెంట్ రోడ్డు నిర్మాణం కూడా నిధులు మంజూరు చేశానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొల్లకుర్మ యాదవులు రూరల్ ఎమ్మెల్యేకు గొంగళి, గొర్రెపిల్లను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కంచెట్టి గంగాధర్, అమృతాపూర్ గంగాధర్, శ్రీనివాస్, ముప్పగంగారెడ్డి, నవీన్‌గౌడ్, రాంచందర్‌గౌడ్, మారుతి, పెద్దమల్లయ్య, గాంధారి రాజు, వడ్ల గంగాధర్, ఒడ్డె సాయిలు పాల్గొన్నారు. బీరప్ప కళ్యాణ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానిని కలిసిన ఆర్గానిక్ రైతు



జీతీయ పసుపుబోర్డు కార్యదర్శి భవానిని, చైర్మన్‌ను కలిసిన రైతు లక్ష్మి నర్సయ్యు

మోర్తాడ్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా నియమితులై మొదటిసారి జిల్లాకు విచ్చేసిన ఐఎఎస్ అధికారి ఎస్.భవానిని మోర్తాడ్‌కు చెందిన ఆర్గానిక్ రైతు లక్ష్మీనర్సయ్య పసుపు కొమ్ములు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అంతేగాక జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డిని కలిసి శుభా కాంక్షలు తెలిపారు. జిల్లాలో పసుపు పంటకు మహర్దశ తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నందుకు పల్లె గంగారెడ్డిని అభినందించారు. మోర్తాడ్‌లో ఎఫ్‌పీవో గురించి వివరించి సందర్శించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్‌కుమార్

వైద్య, ఉపాధి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సెక్స్ వర్కర్లు కారణాలు ఏమైనా ఈ వృత్తిని ఎంచుకొని కుటుంబ పోషణ చేసుకుంటున్నారని తమ ఆరోగ్యం కోసం, కుటుంబ పోషణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో స్నేహసొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. భవిష్యత్తు తరాలు ఈ వృత్తిలోకి రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సుధాకర్, స్నేహసొసైటీ కార్యదర్శి సిద్ధయ్య పాల్గొన్నారు.

బోర్గాం పాఠశాలలో మెడిటేషన్ క్లాస్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

మోపాల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోర్గాం(పి)లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మెడిటేషన్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకున్న పాఠాలను ఏ విధంగా గుర్తుంచుకోవాలనే విషయంలో ఈ మెడిటేషన్ క్లాస్‌లో టిప్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో బోర్గాం జడ్పీహెచ్ఎస్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ పాఠశాలలో 194 మంది పదో తరగతి పరీక్షలకు హాజరవుతు న్నారని అన్నారు. ఇష్టంగా చదవాలే తప్ప కష్టంగా కాదన్నారు. ఈ కార్యక్రమంలో మెడిటేటర్ గంగాప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంప్లాయిస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ జిల్లా యూనియన్ డైరీని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కమిషనర్ ఛాంబర్‌లో డైరీని, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ సమస్యల కోసం ఐక్యమత్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ యూనియన్ అధ్యక్షుడు విజయ్‌సింగ్, ఉద్యోగులు రమేష్, అనుపమ, శోభారాణి, సాయికుమార్, శ్రీనివాస్, సలీమ్ ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్

ధర్పల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభు దిశానిర్దేశం చేశారు. సోమవారం పైలెట్ గ్రామంగా ఎంపికైన సీతాయిపేట గ్రామంలో లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు మార్క్ ఔట్ ఇచ్చారు. గ్రామంలో 113 మంది కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఏ విధంగా చేపట్టాలనే అంశంపై లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నమూనాను వారు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, సహాయక అభియంత సత్యనారాయణ, కార్యదర్శి కృష్ణకాంత్, సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే



గ్రాండ్ పేరెంట్స్‌డేలో పాల్గొన్న విద్యార్థుల అమ్మమ్మలు, నాన్నమ్మలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మాధవనగర్‌లోగల ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నాన్నమ్మలు, అమ్మమ్మలు రకరకాల వంటకాలను తయారు చేసుకొని వచ్చి ప్రదర్శనలో ఉంచారు. అదేవిధంగా తమ మనుమళ్లు, మనుమరాళ్లతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌కు వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తమ విద్యార్థి దశలోని అనుభవాలతో పాటు విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులను నేటి తరానికి తెలియజేయాలను ఉద్దేశంతో గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించడం జరిగిందని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారయ్యగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో హరితగౌడ్, డైరెక్టర్ హర్షిత్‌గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

● 'ప్రజావాణి'కి 62 వినతులు



ప్రజావాణి కార్యక్రమంలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ దరఖాస్తుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 వినతులను అధికారులు స్వీకరించారు. దరఖాస్తుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డిలకు విన్నవించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, లెక్చరర్ వేధిస్తున్నారని విద్యార్థుల ఫిర్యాదు..

డిచ్‌పల్లి మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల బాయ్స్-1 ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్ కుమార్‌రెడ్డి తమను వేధింపులకు గురిచేస్తున్నారని కళాశాల విద్యార్థులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ నుంచి ఫెనాల్టీ పేరుతో కలెక్ట్ చేసిన డబ్బులను మిస్‌యూజ్ చేయడమే కాకుండా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. కళాశాలలో లెక్చరర్లు అనవసరంగా లీవ్‌లు పెడుతున్నారని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అడిగినప్పటికీ పెట్టడం లేదని, తమను వేధింపులకు గురిచేస్తున్న లెక్చరర్, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వినతి పత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీవోలను సవరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమా

సుభాష్‌నగర్,మార్చి 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం కొత్త డ్రాఫ్ట్ జీవోలలో కార్మికులకు కనీస వేతనాలు నయాపైసా పెంచలేదని ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీవోలను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వీ రమా అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాలు, పని ప్రదేశాల్లో సభలు, సమావేశాలు జరపాలని కార్మికశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా, వినతిపత్రాలు, 7వ తేదీన హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య కోటి 20లక్షల మంది ఉన్నారని వీరికి వేతనాలు ఉమ్మడి రాష్ట్రంలో 2006 నుంచి 2012 వరకు సవరణలు చేశారని అన్నారు. చివరిసారి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో సవరించిందని ప్రస్తుతం సవరించాల్సిన జీవోలు ఉన్నా సవరించడం లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పారిశ్రామిక యజమానులకు లాభాలు పెంచడం కోసమే వేతనాలు పెంచడం లేదన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ కార్మికులు కనీస వేతనాలు పోరాడి సాధించుకోవాలన్నారు. గత పది సంవత్సరాలుగా సీఐటీయూ నిరంతరం కనీస వేతన జీవోల సవరణ కోసం సమరశీల పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, కటారి రాములు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ టూర్‌కు శంకర్‌భవన్ పాఠశాల విద్యార్థులు



విద్యార్థులకు వివరిస్తున్న మున్సిపల్ అధికారులు

సుభాష్‌నగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బయోమైనింగ్, బయోగ్యాస్ పనులను శంకర్‌భవన్ పాఠశాల విద్యార్థులు పరిశీలించారు. నగరంలోని నాగారంలోగల డంపింగ్ యార్డుకు సోమవారం ఎడ్యుకేషన్ టూర్‌కు వెళ్లి వాటి పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా డంపింగ్ యార్డు నిర్వాహకులు బయోమైనింగ్, బయోగ్యాస్, ఎరువుల కంపోస్ట్, ఎఫ్ఎస్‌టీపీ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెత్త వల్ల కలిగే పరిణామాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, డంపింగ్ యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

లింగన్న కుటుంబాన్ని సంఘ బహిష్కరణ చేయలేదు

వేల్పూర్, మార్చి3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో బొడ్డు లింగన్న (జెండకాడి) కుటుంబాన్ని కులబహిష్కరణ చేయలేదు, ఎలాంటి జరిమానా విధించలేదని యాదవ సంఘం తెలిపింది. బొడ్డు లింగన్నకు సాయిలు, లింగేశ్వర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఆదివారం సాయంత్రం లింగన్న అనారోగ్యంతో మరణించాడు. ఆయన అంత్యక్రియాల విషయంలో ఇద్దరు అన్నదమ్ముళ్ల మధ్య ఆస్థి పంపకంపై వివాదం నెలకొంది. ఈ విషయం యాదవ సంఘానికి తెలపగా అన్నదమ్ముళ్లు మీరే సామరస్యంగా పరిష్కరించుకోవాలని యాదవ సంఘం వారిద్దరికి సూచించింది. ఈ విషయంలో పెద్ద కుమారుడు సాయిలు సంఘ నిర్ణయాన్ని ఒప్పుకోగా, చిన్న కుమారుడు వ్యతిరేకించాడు. తమ తండ్రి అంత్యక్రియాలు జరపాలని పెద్దకుమారుడు సంఘానికి కోరగా సంఘం అందుకు అంగీకరించి లింగన్న అంత్యక్రియలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ సంఘం నిర్ణయం చెప్పక ముందే లింగన్న చిన్న కుమారుడు లింగేశ్వర్ తొందరపడి వేల్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సంఘం తెలిపింది. ఈ విషయమై ఎస్సై సంజీవ్ గ్రామానికి వచ్చి అన్ని కోణాల్లో విచారణ జరిపారు. లింగన్న కుటుంబానికి సంఘ బహిష్కరణ లేదని, లింగన్న ఆస్థి పంపకంలో అన్నదమ్ముళ్ల మధ్య వివాదం జరిగిందని తెలిపారు. లింగన్న అంత్యక్రియాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగాయని, అన్నదమ్ముళ్లు ఇద్దరు, కుటుంబసభ్యుల బంధు మిత్రులు, సంఘ సభ్యులు పాల్గొన్నారని ఎస్సై సంజీవ్ తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించిన తొర్లికొండ విద్యార్థులు

జక్రాన్‌పల్లి, మార్చి3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఫిబ్రవరి 28నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగిన 5వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో జి.సరిత, ఆర్.గంగోత్రి, బి.మైత్రి, బి.వనజలు పాల్గొని జట్టు విజయానికి కీలకపాత్ర పోషించి బంగారు పతకాలు సాధించారని వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. బాలుర విభాగంలో డి.విష్ణుచైతన్య, డి.మురళి, సీహెచ్.సుశాంత్ జట్టు విజయానికి కృషి చేసి ద్వితీయ స్థానంలో గెలుపొంది కాంస్య పతకాలు సాధించారని ఆయన తెలిపారు. మినీ జూనియర్ ఎంపికలో కె.కిశోర్, ఎం.సిద్ధర్థ పాల్గొని రాష్ట్ర ప్రబబుల్స్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా సోమవారం బేస్‌బాల్ పోటీల్లో పలు పతకాలను సాధించిన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడీసీచైర్మన్ నాగేంద్ర, వైస్‌చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి పురస్కారాల అందజేత

మోర్తాడ్, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్‌పాల్ మాజీసర్పంచ్ పర్స దేవన్న, మోర్తాడ్‌కు చెందిన డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్నలు సోమవారం విశ్వశాంతి పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హర్యాణి సకల కళావేదిక సంస్థ జాతీయస్థాయి ఉగాది పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వారిని గుర్తించి ప్రతిభకు ప్రొత్సాహం కల్పించేందుకు అవార్డులను ఎంపిక చేశారు. మాజీసర్పంచ్ దేవన్న గ్రామంలో అనేక సేవలు అందించారని వాటర్‌షెడ్ పథకం 13ఊట చెరువుల నిర్మాణం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వాశాంతి నిర్వాహకులు పాల్గొన్నారు.

లక్కోర జీపీ కారోబార్ కుటుంబానికి ఆర్థిక సహాయం

వేల్పూర్, మార్చి3(ఆంధ్రజ్యోతి): లక్కోర గ్రామపంచాయతీ కారోబార్ సాయన్న కుటుంబానికి సోమవారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీవో సాయిలు అందజేశారు.కారోబార్ సాయన్న ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబానికి గ్రామపంచాయతీ ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మద్దురి విజయ్‌కుమార్, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి వీడితేనే విజయం సాధిస్తారు

ధర్పల్లి,మార్చి 3 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఒత్తిడిని తట్టుకొని విజయం దిశగా పయనించాలని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ అల్లాడి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోగల లిటిల్ హార్ట్స్ పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సెస్సీ విద్యార్థులకు పునాది వంటిదని ఈ దశలోనే విద్యార్థులు తమ గమన్యాన్ని ఎంచుకొని గమ్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధిస్తారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పాటల స్టెప్పులతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సాధన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో నీట మునిగి వ్యక్తి మృతి



మృతుడు రవి

నందిపేట, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఊరచెరువులో నాగం రవి(52) అనే వ్యక్తి నీట మునిగి మృతి చెందినట్టు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పాతూరుకు చెందిన నాగంరవి ఆదివారం బైపాస్ రోడ్డులో గల ఊరచెరువులో ఉన్న గణేష్ విగ్రహాల ఇనుప స్టాండ్‌ల కొరకై చెరువులో దిగాడు. ఇనుప చువ్వలను బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. సోమవారం మృతుని తండ్రి నాగం రాజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి కుకునూర్‌లో పసుపు బాలాజీ బ్రహ్మోత్సవాలు

వేల్పూర్ మార్చి3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి (పసుపుబాలాజీ) దేవస్థానం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సుప్రభాత సేవ, పంచామృతలతో అభిషేకం,పుణ్యాహవచనం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం, మండపఅర్చన, అగ్నిప్రతిష్ఠ, బలిహరం, సామూహిక కుంకుమార్చన, తీర్థగోష్ఠి వంటి కార్యక్రమాలను గ్రామ వైదిక పురోహితుడు ప్రశాంత్‌చార్యుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. 5న నిత్యహో మం, ఎదుర్కొలు, వెంకటేశ్వరస్వామి కల్యాణం, నిత్యహోమం, రథబలి,రథహోమం, రథోత్సవం జరుగుతుందన్నారు. 6న నర్సింహ వాహనం, చక్రతీర్థం,మహాపూర్ణహుతి, సామూహిక సత్యనారాయణ వ్రతం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం పుష్పయాగం, ఏకాంత సేవ, పండిత సత్యహారం, మహాఆశిర్వచనం, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమ్‌గల్,మార్చి3(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై మహేష్ తెలి పారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముచ్కూర్‌చౌరస్తా వద్ద ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్ వేముల సతీష్‌ను సంబంధిత పత్రాలు అడగగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పైలట్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్క్ అవుట్

సిరికొండ మార్చి 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గృహనిర్మాణశాఖ అధికారులు, ఎంపీడీవోతో కలిసి ముగ్గు వేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో చిన్నావాల్గోట్‌ను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి మంజూరు పత్రాలను, రేషన్ కార్డుల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ప్రభుత్వ ఆదేశాను సారంగా చిన్నవాల్గోట్ గ్రామంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహనిర్మాణశాఖ డీఈ ప్రభుదాస్, ఏఈసత్యానారాయణ సోమవారం ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోశారు.బిల్లులు రావడానికి డాక్యుమెంటేషన్ ఏఈ సత్యానారాయణ ద్వారాచేయించుకోవాలని డీఈ ప్రభుదాస్ లబ్ధిదారులను కోరారు.కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి శరణ్య, మాజీసర్పంచ్ బాడాలమహిపాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేపు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలకు జాబ్‌మేళా

నిజామాబాద్‌అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలకోసం ఈనెల 5న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లాఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ కంపెనీ నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలలో ఫార్మసిస్ట్, జూనియర్‌అసిస్టెంట్, ఆడిటర్ పోస్టులు ఉన్నాయని ఇంటర్మీడియెట్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఏదైనా డిగ్రీ పాసైన యువతీ యువకులు అర్హులని ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పనిచేయాల్సి ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 5న శివాజీనగర్ జిల్లాఉపాధికార్యాలయంలో ఉదయం 10.30ల నుంచి హాజరుకావాలన్నారు.అభ్యర్థులు తమ రెజ్యూమ్‌తో పాటు బయోడేటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ, ఇతర విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరుకావాలని వివరాలకు 9948748428 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

సిరికొండ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం కొండూర్ గ్రామంలో పది లక్షలతో నిర్మించేరెండు సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో రెండుసిమెంటు రోడ్లకు పది లక్షలు, ఒక్క డ్రైనేజీ నిర్మాణానికి రూ.ఐదు లక్షలను శాసనసభ్యులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.సోమవారం గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజచేశారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులుమాజీసర్పంచ్ అన్నం దశరత్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి,సల్లారాజరెడ్డి, సదానంద్, చెల్లం భాస్కర్‌రెడ్డి,నరేష్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

డబ్బుల కోసమే వేధించారు

ఇందల్వాయి,మార్చి3(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ధరణి ఆసుపత్రి సిబ్బందిని డబ్బుల కోసమే యూ ట్యూబ్ ఛానల్‌కు చెందిన శివ, గణేష్‌లు ఆసుపత్రి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి డబ్బుల కోసమే వేధించారని ధరణి ఆసుపత్రి డాక్టర్ విష్ణుకుమార్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా శివ, గణేష్‌లు ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ ఆసుపత్రిలోనికి వచ్చి వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని లేకపోతే ఉన్నతాధికారులకు చెప్పిఆసుపత్రిని మూసివేయిస్తామని బెదిరింపులకు గురిచేశారని అన్నారు. బెదిరింపులకు గురిచేసిన శివ, గణేష్‌లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశామన్నారు. అన్ని పరిమితులతోనే ఆసుపత్రిని నడుపుతున్నామని డాక్టర్ విష్ణుకుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ

సుభాష్‌నగర్,మార్చి 3(ఆంధ్రజ్యోతి):జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలో జిల్లా క్రీడాకారిణి ప్రథమ ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, రమేష్‌లు తెలిపారు. హర్యానాలో జరిగిన 37వ జూనియర్ జాతీయ స్థాయి పోటీలలో అభ్యాస పాఠశాలకు చెందిన సంహిత ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రాన్ని రెండోస్థానంలో ఉంచడంలో సంహిత తనదైన పాత్ర పోషించినట్లు తెలిపారు.క్రీడాకారిణి సంహితనుస్కూల్ యాజమాన్యం,అసోసియేషన్‌సభ్యులు ఘనంగా సన్మానించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.87800	రూ.81030	రూ.990

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (హిందీ) (10.15)
: శబ్దం (1.35)
: సంక్రాంతికి వస్తున్నాం (4.40)
: అగాధియా (7.50)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)

స్క్రీన్-2 : శబ్దం (10.05)
: చావా (హిందీ) (1.10, 7.35, 10.55)
: మజాకా (4.30)

స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.10)
: మజాకా (1.20)
: గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్ (హిందీ) (4.25)
: శబ్దం (7.40, 10.45)

స్క్రీన్-4 : నేనెక్కడున్నా (10.45)
: గార్డ్ (1.25)
: చావా (హిందీ) (4.00)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)
: మజాకా (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 4.40, 7.30, 10.20)

స్క్రీన్-2 : గార్డ్ (11.00)
: మజాకా (1.30, 7.35, 10.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (4.40)

స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (1.40, 7.30)
: శబ్దం (4.40, 10.20)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : చావా (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)

విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్